# త్రిశంకు జీవితం

"లేచి గంటయింది. కాఫీ ఇవ్వాలని తోచదా నీకు? నేను అడిగాక ఇద్దామనుకున్నావా?" ముందు గదిలోంచి విక్రాంత్ అరిచాడు.

"అయ్యో! మీరు లేచింది చూడనేలేదు. వంట హడావుడిలో ఉన్నాను" అంటూ పరుగులు తీస్తూ కాఫీ అందించాను టీవీ ముందు కూర్చున్న విక్రాంత్‌కి.

ఇంకొక పావుగంట టైముంది. నాది, బాబుది టిఫిన్ బాక్సులు సర్దాలి. చీర కట్టు కోవాలి.

రాత్రి పని ముగించుకుని ఇంటికి పన్నెండు గంటలకి వచ్చాడు. ఆ పని ఏమిటని నె[illegible]డగకూడదు? ఎందుకాలస్యం అయిందని అనకూడదు. నిద్రకళ్లతో ఎదురుచూ[illegible]డదు. బెల్ వినపడగానే ఎదురుచూస్తున్నంత ఉత్సాహంగా తలుపుతీయాలి.

తనకేనా సరదాలు, స్నేహితులు నాకుండవా? కావాలంటే నేను కూడా ఎక్కడికైనా వెళ్లచ్చు. ఇంటికి ఆలస్యంగా రావచ్చు. ఇదా పరిష్కారం? ఇద్దరం పడుకునేటప్పటికి పన్నెండు దాటింది. నేను మామూలుగా నాలుగున్నరకే లేచాను. మరి తను? నేను స్కూలుకెళ్ళే టైంకి లేచాడు? వంటింట్లోకి వచ్చి, కాఫీ తీసుకోవచ్చు కదా! ఏవిటీ అహంకారం?

సంసారానికి ఇద్దరం సమానం కాదా! నామీద ఎంత చిన్నచూపు? ఎందుకంటే నా జీతం మూడు వేలబైదొందలు మాత్రమే. విక్రాంత్ జీతం ముప్ఫై వేలు కాబట్టి.

బాబు టిఫిన్ డబ్బా, మంచినీళ్ళ సీసా, నాప్‌కిన్, ప్లాస్టిక్ బుట్టలో పెట్టి, డైనింగ్ టేబుల్ మీద వాడికి కనబడేటట్లు పెట్టాలి. లేకపోతే ఆటో అబ్బాయి కిందనుంచి హారన్ వేయగనే టిఫిన్ లేకుండానే వెళ్ళిపోతాడు. అన్నం తినడం అంటే ప్రళయం. "నాకు టిఫిన్ బ్యాగ్ కనబడలేదు" అంటూ ఓ సాకు చెప్తాడు.

గంజి చీర కట్టుకునే టైం లేక, షిఫాన్ జార్జెట్ చీర కట్టుకున్నాను.

తినడానికి టైం లేదు. చిన్నగా నిట్టూర్చాను.

కాఫీ తాగిన గ్లాసు డైనింగ్ టేబుల్ మీద పెడ్తూ నావైపు చూశాడు.

"ఆ జుట్టు చూసుకో. ఎలా ఉందో? అద్దంలో ఓ సారి మొహం చూసుకుని స్కూలుకి వెళ్ళు" చీదరింపుగా అన్నాడు.

రెండు నిముషాల్లో ఓ చేతికి వాచీ, మరోచేతి భుజానికి బ్యాగ్ సర్దుకుంటూ చెప్పులు వేసుకోవడానికి ముందుగదిలో ఆగాను.

అంతకుముందురోజున ఆడిన ఇండియా పాకిస్తాన్ మ్యాచ్‌ని మళ్ళీ చూస్తున్నాడు బాబు. ముందు పుస్తకాలున్నాయి. తయారవ్వలేదేం అని అడిగే టైం లేదు.

తెలుగు పేపర్ అత్తయ్యగారు, ఇంగ్లీషు పేపర్ విక్రాంత్ చూస్తున్నారు.

"వెళ్తున్నా" అంటూ తలుపుతీసాను.

"భోంచేశావా?" పేపర్ కిందికి దించి పైనుంచి అత్తగారు అడిగారు.

కృతజ్ఞతగా ఆవిడవైపు చూశాను.

ఇందాకట్నించి ఉన్న ఆవేదన, విసుగు, బాధ అన్నీ ఒక్కసారి మాయమయ్యాయి. ఓ చిన్నమాటికి ఎంత బలం.

"లేదు. టైం లేకపోయింది"

"ఫోన్లే సన్నబడతావులే" హేళనగా అన్నాడు విక్రాంత్.

మళ్ళా నామీద నాకే జాలి వేసింది ఆ మాటతో.

లిఫ్ట్‌లో కిందకొచ్చాను.

గబగబా అడుగులు వేస్తూ రోడ్డు మీదకొచ్చాను. ఈసిఐఎల్ బస్సు ఇంకా రాలేదు. ఆ బస్సు ఎక్కేవాళ్ళు నుంచుని ఉన్నారు. ఈ బస్సు రాలేదంటే నేను సరిగ్గానే బయల్దేరానన్నమాట. ఆచార్య రంగా అగ్రికల్చరల్ యూనివర్శిటీ బస్సు ఎదురొచ్చింది.

ఫర్వాలేదు. అడుగు మెల్లగా వెయచ్చు. ఈ రెండు బస్సులు నాదార్లో టైం చెప్పే గడియారాలు.

మరో నాలుగడుగులు వేయగానే శ్యామల చేతిలో సంచితో కనబడింది. శ్యామల మా స్కూల్లోనే ప్రైమరీ క్లాసుల తెలుగు టీచర్. స్కూల్‌కి రావడం లేదన్న. ఆ నలిగిన చీర, చెదిరిన జుట్టు చూసి ఆశ్చర్యపోయాను.

"స్పెషల్ క్లాస్ ఉందా టెంత్ వాళ్లకి?" అంది నడుస్తూనే.

"లేదే! ఏం?"

"అబ్బే. ఇవ్వాళ సెకెండ్ సాటర్‌డే స్కూల్‌కి సెలవు కదా. నువ్వు వెళ్తాంటే సిలబస్ ఏవైనా కంప్లీట్ చెయ్యమన్నారా అని అనుకుంటున్నాను"

టక్కున ఆగిపోయాను.

ఇవాళ రెండో శనివారమా! ఎలా మర్చిపోయాను.

అదేవిటసలు. సెలవురోజు కూడా గుర్తురానంత మెకానికల్ బ్రతుకైపోయిందా నాది. ఇంకా నయం.

పిచ్చిదాన్లా స్కూల్ వరకూ వెళ్ళిపోయి, మూసేసిన గేటు చూసి ఇంటికి రాలేదు.

వెనక్కి తిరిగి, ఇంటికెళ్ళి బెల్ నొక్కాను.

పావుగంట క్రితం ఇంట్లోంచి వెళ్లినప్పుడు ఎలా ఉన్నారో, ఇప్పుడు కూడా అలాగే ఉన్నారు. టీవీలో అలాగే క్రికెట్ వస్తోంది. పుస్తకాలు బాబు ముందు అలాగే ఉన్నాయి.

"అదేంవిటి? అప్పుడే వచ్చావ్?"

"ఇవాళ సెకండ్ సాటర్‌డే సెలవు. నాకు గుర్తు లేదు. ఎలా మర్చిపోతున్నానో సెలవుల్ని కూడా ఏంటో తేడాల్లేకుండా మెకానికల్‌గా బతికేస్తున్నారు." ఒక్కసారి కళ్ళల్లో నీళ్ళూరాయి. గొంతు చిన్నగా వణికింది.

ఒక్క సెకను వాతావరణం నిశ్శబ్దంగా మారింది.

"ఏం అంత మరచిపోయేంత మెకానికల్ లైఫ్ అని బాధపడిపోతున్నావు. ఉద్యోగాలు చేసేవాళ్ళంతా నీలాగే ఉంటారా? పరధ్యానంగా ఉంటే ఇలాగే అవుతాయి. అయినా వంటింట్లో పెద్ద పెద్ద నంబర్లున్న క్యాలెండర్ ఉందిగా, చూసుకోవద్దా? అది వంటింట్లో దేనికీ! పాలు ఏ రోజున ఎంతెక్కువ పుచ్చుకున్నది. రాసుకోవడానికేనా ? శనివారాలు, ఆదివారాలు, చూసుకుందుకేలే" హేళనగా అన్నాడు.

"నన్నడిగినా నేను చెప్పే వాణ్ణిగా, అనవసరంగా నా బాక్సు అది రెడీ చేశావా! వద్దనేవాణ్ణిగా"బాబు కూడా వంతపాడాడు.

నేనేదో ఏదో పెద్ద తప్పు చేసినంతగా వాళ్ళిద్దరూ అంటూంటే బాధ ఎక్కువైంది.

"ఇవాళ ఏం రోజో, ఒక్కసారి కళ్ళెత్తి కాలెం డర్ని చూసుకోక పోవడం పెద్ద తప్పయిపోయింది. కళ్ళెత్తి చూసే టైం కూడా నాకు లేదు. అంత బిజీగా వంట చెయ్యడంలో మునిగిపోయాను. ఎవరి కోసం మీ కోసం కాదా? అక్కడికి నాలుగున్నరకే లేచి చేస్తున్నా స్కూల్‌కి తిండి తిని వెళ్లడానికి టైం లేకపోయింది" ఉక్రోషంగా అన్నాను.

టివీ ఆపేశాడు గబుక్కున.

"ఆ మాటలనకు. మానెయ్యి. వెధవ ఉద్యోగం మానెయ్యి. నేనేం నిన్ను చెయ్యమని బలవంతం పెట్టలేదే ! నీకుగా నువ్వే చేస్తున్నావు"

"నిజమే! నాకిష్టం అయ్యే నేను చేస్తున్నాను. అంత మాత్రానా .... ఇంట్లో నేను అన్నీ చేయకుండా వెళ్లడం లేదే. అన్ని అమర్చి వెళ్తున్నాను కదా. చదువుకున్నాను కాబట్టి ఉద్యోగం చేయాలనుకున్నాను. మీ సహకారం ఉంటుందని అనుకున్నాను కానీ...."

"నాకు మోకాళ్ళనొప్పులు. నేను గబాగబా చెయ్యలేను. ఏదో నువ్వు వెళ్ళాకా నేను మిగిలిపోయిన పనులు మెల్లగా చేస్తున్నాను" మెల్లగా అన్నారు అత్తగారు.

"నీ సహకారానికి అర్థం ఏమిటో నాకర్థం కావడంలేదు. ఏదో కొంచెం సాయం చేస్తాను కానీ ప్రతీ పనికి వంతు పెట్టను. అయినా అంత పని పని అని ఒకటే ఇదై పోతున్నావు. పని అంటే వంటేగా? వంట ఆడవాళ్ళు చెయ్యడం అన్నది ఈనాటిది కాదు కదా. భూమి పుట్టినప్పట్నించి ఉంది. పెళ్ళయినా, కాకపోయినా ఆడవాళ్లందరూ వంట చేస్తున్నారు. నువ్వొక్కదానివే ఈ లోకంలో వంటచెయ్యడం లేదు. అది గుర్తుపెట్టుకో...."

"చేసిందానికి పేరు పెట్టకుండా ఉంటే నాకు సాయం చేసినంతగా ఫీలవుతాను..."

"ఇద బావుంది. బావుంటే బావుందంటాను. బాగాలేకపోతే బాగా లేదంటాను. దానికి నీ ఉద్యోగానికి లంకె పెట్టేటయితే ఉద్యోగం మానెయ్యి వెధవ జీతం నా ఇంక్రిమెంట్ అంత లేదు. నీ జీతం ....."

గదిలోకి వెళ్ళిపోయి, తలుపు దగ్గరగా వేసి మంచం మీద వాలి పోయాను. నాకు తెలీకుండానే ఎంత సేపు ఏడిచానో నాకు తెలీలేదు.

"లావణ్యా!" అత్తగారు తలుపులు తీసుకుని, వచ్చి మంచం మీద నా పక్కన కూర్చున్నారు.

"లేమ్మా! కళ్ళు తుడుచుకో, నా మాటవిని ఉద్యోగం మానెయ్యి. మా తరానికి, మీతరానికి తేడా చదువులో ఉన్నా మొగవాడి తత్వంలో తేడా లేదు."

"ఏం చెయ్యమంటారు? ఎదిరించి లాభం లేదు. గట్టిగా నోరు పెట్టుకుని పక్క ఫ్లాట్లలో వాళ్ళకి వినపడేటట్లు అరుస్తారు. ఏం చెయ్యను?" ఏడ్చేసాను నిస్సహాయంగా.

"ఏం చెయ్యక్కర్లేదు. ఉద్యోగం మానెయ్యి. చూడు ఏం జరుగుతుందో?"

"ఏం జరుగుతుంది. నా ఖర్చులకి, జాకెట్లకీ, లంగాలకి డబ్బడగాల్సి వస్తుంది. పైసా పైసా లెక్క చూపించమంటారు. తనెంత ఖర్చు చేసినా నోరెత్తకూడదు. ఈ గొడవలకి విసుగెత్తే కదా. ఉద్యోగం చేస్తున్నాను. ఇప్పుడు అది కూడా .... "ఏడుపు ఆగలేదు.

"పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. చదువులు, ఈ ఇంటికి నెలనెలా కట్టి వాయిదాలు, మా మందులు, పండగలు, పుట్టినరోజులు... అన్నీ వాడే చూసుకుంటాడు. అసలేం జరుగుతుందో చూద్దాం మానెయ్యి" అత్తగారు అన్నారు.

"రేపే మానేస్తాను. ఈ గొడవలు నేను భరించలేను రాత్రింబవళ్ళు"

మర్నాడు అన్ని పెండింగ్ వర్క్‌లు, పేపర్లు, టీచింగ్ నోట్స్‌లు, టీచర్స్ కాపీలు, క్వశ్చన్‌పేపర్లు అన్నీ రెడీ చేసుకున్నాను సోమవారం స్కూల్లో ఇచ్చేయడానికి మేడమ్ ఏం అంటుందో అని బెంగగా ఉంది.

"రెండు నెలల్లో పబ్లిక్ పరీక్షలున్నాయి. బయాలజీ స్కోరింగ్. కొంచెం పర్సంటేజీ పెరగడానికి ఇందులోనే ఆస్కారం. ఆ ఫిజికల్ సైన్స్‌లో తక్కువస్తున్నాయి కదా ఇంక నువ్వు కూడా ఈ టైంలో వెళ్ళిపోతే .... పిల్లలు నష్టపోతారు" ఆవిడ అంటుందో లేదో కాని నాకే గిల్టిగా ఉంది. కానీ ఏం చెయ్యను!

రోజురోజు గొడవ. ఉద్యోగం మానెయ్యి, మానెయ్యి అనీ ప్రతీసారి చిన్న చిన్న విషయాలకి ఉద్యోగంతో లంకె పెడుతూంటే మానెయ్యడమే మంచిది.

సోమవారం అన్ని పనులు చేసుకుని, ఏ విషయంలోనూ గొడవ రాకుండా జాగ్రత్త పడుతూనే స్కూల్‌కి తయారయ్యాను.

గదిలోకెళ్ళాను.

టై కట్టుకుంటున్నాడు.

మనిషి ఎంత చదువుకున్నా మనిషే. ఆకాశంలో పక్షిలా ఎగరగలడు.

నీళ్లల్లో చేపల్తో సమానంగా ఈదగలడు.

అయితే ఏం లాభం?

చదువుకుని ఉద్యోగం చేస్తున్న పెళ్ళాన్ని అర్థం చేసుకోలేడు.

"నేనివ్వాళ రిజైన్ చేస్తున్నాను. రోజు రోజూ ఈ దెబ్బలాటలతో నాకు బిపి వచ్చేటట్లుగా ఉంది. నాకు పీస్‌ఫుల్ లైఫ్ కావాలి....."

'ఆఖరికి సరెండర్ అయ్యావు కదా! రిజైన్‌కి కారణం అడిగితే నా పేరు మటుకు ఎక్కడా రానీకు...."

దెబ్బతిన్నట్లు చూశాను.

ఓ మొగాడి విజయం వెనుక ఓ స్త్రీ ఎలా ఉంటుందో, ఓ ఆడది హాయిగా, పీస్‌ఫుల్‌గా నవ్వుతూ ఉద్యోగం చెయ్యాలంటే మొగుడి సహకారం ఉండాలి.

అస్తిత్వం నిలుపుకోవాలంటే కొన్ని వదులుకోవాలి. ఉద్యోగం చెయ్యడం అస్తిత్వం అనుకున్నాను.

కానీ అంతకన్నా ముఖ్యం పిల్లలు, కాపురం, అందుకోసమే ఈ అడుగు.

అవమానంగా అనిపించింది విక్రాంత్ మాటకి.

నిశ్శబ్దంగా స్కూలుకెళ్లాను.

ఫస్ట్ పీరియడ్ అయింది.

తర్వాత టెంత్ క్లాసుకి బయాలజీ. సిలబస్ అయిపోయింది.

ఫస్ట్ యూనిట్‌లో సందేహాలు తీర్చి, సాయంత్రం ఎక్స్‌ట్రా క్లాసులో చిన్న టెస్ట్‌కి ఏం ప్రశ్నలు చదువుకోవాలో చెప్పాలి అనుకుంటూ పదో క్లాసులోకి అడుగుపెట్టబోతుంటే వెనక్కాల్నించి "టీచర్.... మీకు ఫోన్...." అన్నట్టు వినబడింది.

వెనక్కి తిరిగాను.

మళ్ళీ అరచెయ్యి చెవి దగ్గర పెట్టి "ఫోన్" అంది ఆయా.

నాకు స్కూల్‌కి ఎప్పుడు ఫోన్ రాలేదు. ఎందుకో ఫోన్ అన్నది ఏ మూలో చిన్న భయం చోటుచేసుకుంది.

ఏమై ఉంటుంది? ఏక్సిడెంట్? అత్తగారికి ఏమైనా అయి ఉంటుందా? ఊహకి అందలేదు.

కంగారుగా ఉన్నా, కప్పిపుచ్చుకుని ఆఫీసులోకెళ్ళాను.

మిసెస్ జైన్ నవ్వుతూ రిసీవ్ అందించింది. హజ్బెండ్"

మనసు ఎలాగో అయింది.

"హలో!" నిరాసక్తితో అన్నాను.

"లావణ్య! రిజిగ్నేషన్ లెటర్ ఇచ్చేశావా?" కంగారుగా అన్నాడు.

"లేదు ఏం?"

"ఇవ్వకు ప్లీజ్!"

నిటారుగా నుంచుండిపోయాను.

" మీ ఇష్టమేనా అన్నీ! ఓసారి మానేయమని, ఓసారి వద్దని, నేనుద్యోగం చెయ్యనుగాక చెయ్యను. ఇంట్లో, బయటా నేనెందుకు కష్టపడాలి? మీలాగే ఏదో ఒకటి చేస్తాను. మీరు ఆఫీసుకెళ్ళి డబ్బు తెండి. నేను ఇంట్లో రకరకాల వంటలు, టిఫినీలు చేస్తూంటాను.

జీవితం తినడానికి అనే మీకు రకరకాలు చేసి అమర్చిపెడతాను. ఇన్నాళ్ళు ఈ చిన్న ఫిలాసఫీ తెలీక వెర్రిదాన్లా ఉద్యోగం చేశాను. వెధవుద్యోగం నా జీతం ఆఫ్ట్రాల్ మీ ఇంక్రిమెంటంత లేదు. పిచ్చిదాన్ని సంపాదన, ఆర్థిక స్వాతంత్ర్యం అంటూ ఉబలాటపడుతూ ఉద్యోగం చేసి రోగం తెచ్చుకుని, మంచం ఎక్కితే గ్లాసుడు మంచినీళ్ళు కూడా అందివ్వరు. ఆకాడికి నేనెందుకు చెయ్యాలి?' అని మనసులోనే అనుకున్నాను పెదిమలు బిగిస్తూ.

నా నిశ్శబ్దం నన్ను చూస్తున్న ఆఫీసు స్టాఫ్‌లో ఇంట్రెస్ట్ పెంచింది.

"వింటున్నావా? నా ఉద్యోగం పోయింది. సాయంత్రం అన్నీ మాట్లాడుకుందాం. రిజైన్ చెయ్యకు"

"వెంటనే వెళ్ళిపొమ్మన్నారా!"

"నెలరోజులు టైమిచ్చారు. ప్లేస్‌మెంట్స్ ఆఫీసు కెళ్తున్నాను."

వినదల్చుకోలేదు. ఫోన్ పెట్టేశాను. చిరునవ్వుని అతికించాను మొహానికి.

"ఓకే ఏదో ఊరు అర్జెంట్‌గా వెళ్ళాలిట. బట్టలవీ ఎక్కడ పెట్టావో అడగడానికి

ఫోన్ చేశారు. ఇంటికెళ్ళాలి. నేను లేకపోతే తనకి ఏం తెలీదు. ఏం కనబడదు. పక్కనే ఉన్నా చూసుకోరు." నా మనస్సుని మోసగిస్తున్నాను. అబద్ధపు బతుకు. దొంగబతుకు.

"వెళ్ళండి. హెచ్.ఎం. ని కలవండి. లీవులున్నాయా?" అని అడిగింది జైన్.

"వెళ్తాను" లేని నవ్వుని తెచ్చుకుని బయటికొచ్చాను.

ముసుగు బతుకు, అబద్ధపు బతుకు హు. ఇది విజయమా? అపజయమా? గెలుపా, ఓటమా? సందిగ్ధంలో ఉన్న నేను రాలడానికి సిద్ధంగా ఉన్న కన్నీటిని దాచుకోవడానికి పక్కనే ఉన్న బాత్రూంలోకి దూరాను.

అప్పటికే కన్నీళ్ళు గొంతుకలోకి చేరిపోయి అక్కణ్ణించి గుండెల్లోకి జారిపోయి మోయలేని బరువుని గుండెకి యిచ్చాయి.

❖ జులై 2004, ఆంధ్ర భూమి మాసపత్రిక ❖

❖❖❖